# నేనూ నా ప్రేమ కథ

## మల్లిక్

ఆశ్చర్యం కలిగించే ప్రేమ కథలు ఉంటాయ్. వార్ని! .... ప్రేమకోసం ఎంత తెగించారు!!....ఎంత సాహసంచేశారు వీళ్ళసాధ్యం కూలా అని మనం ముక్కున వేలేసుక్కుని తీరాల్సిందే కొన్ని ప్రేమ కథలు విన్న తరువాత. అలాగే మనసుకు బాధ కలిగించే ప్రేమకథలు ఉంటాయ్. అరెరే.... ప్రేమకోసం ప్రాణాలుకూడా త్యాగం చేశారే అని కొన్ని ప్రేమకథలు విన్న తరువాత బాధపడతాం అందులో ప్రాణ త్యాగం చేసిన హీరోతో మనల్ని మనం పోల్చుకుని మరింత ఆదిగా బాధపడ్తాం. నిజమే కదా....హీరోతో కాకుండా విలన్‌తో పోల్చుకోవడం సాధ్యమా చెప్పండి.

నా మట్టుకు నేను కొన్ని ప్రేమకథలు చదివి ముక్కున వేలేసుక్కున్నాను. కొన్ని ప్రేమకథలు చదివి బాధపడిపోయాను.

ఒకసారి పకపకా నవ్వించే ప్రేమకథలు ఉండవా? అని సందేహంతో నా ప్రక్కసీట్లో పనిచేసే పాపారావ్‌ని అడిగాను. వాడు జేబురుమాలుతో నోరుమూసుకుని ఘొల్లున నవ్వాడు. రుమాలుతో నోరు మూసుకుని నవ్వడమేమిటీ అని ఆశ్చర్యపోతున్నారా? నవ్వేటప్పుడు నామీద తుంపర్లు పడకుండా ఉండేందుకు వాడు అలా చేసి ఉండొచ్చు అని సహృదయంతో మీరు ఆలోచించవచ్చు గానీ ఆగాడిద అలాంటి ఉపకారబుద్ధి ఉన్న వాడు కాదు. నాదగ్గర సంవత్సరం క్రితం అప్పుగా తీసుక్కున్న వంద రూపాయలు ఇప్పటి వరకూ ఇవ్వలేదు.

సరే ...పక పకా నవ్వించే ప్రేమకథలు ఉండవా అనికదూ నేను వాడిని అడిగింది?...

నవ్వి నవ్వి తడిసి ముద్దయిన జేబు రుమాలు నోటి మీదినుండి తీసి "తెలుగు సినిమాలు నువ్వసలు చూడవా?" అని ఎదురు ప్రశ్న వేసి వెళ్ళిపోయాడు పాపారావ్.

నేను బిక్కచచ్చిపోయాను. ఆ సమయంలో అద్దంలో నాముఖం నేను గనుక చూసుకుని ఉంటే వెధవని వెయ్యికి తక్కువ కాకుండా తిట్టుకుని ఉండేవాడిని.

అసలు పాపారావ్ జేబురుమాలు నోటికి అడ్డు పెట్టుకుని ఎందుకు నవ్వుతాడో చెప్పలేదు కదూ?....వాడి పలువరస కూడా వంకరగా ఉంటాయ్.

ఈ నవ్వు పుట్టించే ప్రేమకథలు నాకో పెద్ద సమస్య అయిపోయింది. వాటి తాలూకు ఆలోచనలు పాతబడిపోయిన పెళ్లాంలా మెదడుని తినేయసాగాయ్

హాస్యకథల పోటీలో ఎన్నికైన కథ



ఎన్నో....ఎన్నెన్నో ప్రేమకథలు చదివాను గానీ అన్నీ త్యాగాల ప్రేమకథలు, విచారం ప్రేమకథలు, సంతోషం ప్రేమకథలు. ఇంకా వగైరా వగైరా ప్రేమకథలు ...

అసలు ఈరచయితల్ని అనాలి... ఛా ...

"డ్రాఫ్టింగ్ చెయ్యడం రాకపోతే అడిగి తెలుసుకోవాలి....అలా ఫైలు మీద ఉమ్మేస్తే ఎలా?..." మా సూపరింటెండెంటు సీరియస్‌గా నావైపు చూస్తూ అన్నాడు.

ఆలోచనల్లో మునిగిపోయి నేను చేసిన తప్పును గ్రహించాను. జేబురుమాలు తీసి ఫైలును తుడిచాను.

ఆరోజు నామనసు ఆనందంతో గంతులు వేసింది ఎందుకంటే ఆరోజే మాఆఫీసులో కొత్తగా ఓ టైపిస్టు చేరింది. పేరు హేమమాలిని అయితే బావుండేది కానీ కాదు.... సుబ్బలక్ష్మి.

సుబ్బలక్ష్మి!....ఆ అమ్మాయిని చూసిన తరువాత ఆ పేరు కూడా నాకు ఎంతో మంచి పేరులా అనిపించింది. అయినా పేరులో ఏముంది?...

చూసిన మరుక్షణం నేను అనుకున్నాను నా డ్రీమ్ గర్ల్ ఆ అమ్మాయేనని.

అంత మాత్రంచేత మనసు గంతులు వేయాలనేం లేదుగా?....

మా మేనేజరు పరాంకుశం ఆ అమ్మాయిని ప్రతి బల్ల దగ్గరికీ తీసుకువెళ్ళి అందరికీ పరిచయం చేశాడు.

"ఈయన ఈ సెక్షనులో యు. డి. సి. అప్పుడప్పుడూ మన ఆఫీసు కల్చరల్ ప్రోగ్రాంలలో, నాటకాల్లో వేషాలు వేస్తుంటాడు. చాల యాక్టివ్ పర్సన్ లే...." అన్నాడు అమ్మకడపు చల్లగా పరాంకుశం.

సుబ్బలక్ష్మి చిరునవ్వుతో నమస్కరించింది.

"అయితే మీరు మంచి నటులన్నమాట!...."

ఇదిగో.... ఇక్కడే ఆనందంతో నా మనసు గంతులు వేసింది. ఉక్కిరి బిక్కిరి అయిపోయాను....

గబుక్కున కుర్చీలోంచి లేచాను. నమస్కారం పెడదామని అనుకుంటే చేతిలో ఫైలుంది ఈ వెధవ ఫైలు చేతిలోకి ఎలా వచ్చింది?

విసురుగా టేబులు మీద ఫైలు పడేశాను. ఆ విసురుకి దొంతరగా ఉన్న మిగతా ఫైళ్లు నేలమీద పడ్డాయ్. గబగబ క్రిందికి వంగి వాటిని ఏరి టేబుల్ మీద పెట్టి చిరునవ్వు నటిస్తూ నమస్కారంపెట్టి ఎదురుగా చూశానుగానీ అక్కడ సుబ్బలక్ష్మి గానీ పరాంకుశంగానీ కనబడలేదు.

నేను దరిద్రపు మొహాన్ననీ....నష్టజాతకుడిననీ చిన్నప్పటినుండీ మా అమ్మ నన్ను తిడ్తూనే ఉంది. అది నిజమే అనిపించింది నాకు. ఎందుకంటే సుబ్బలక్ష్మిని మా సెక్షనులో కాకుండా ప్రక్క సెక్షనులో వేశారు.


సుబ్బలక్ష్మి అటెండెన్సు రిజిస్టరులో సంతకం చెయ్యడానికి రోజూ మా సెక్షనుకి రావాలి....అలా రోజూ ఆమెను చూసే అదృష్టం నాకు దొరికింది.

ఒకసారి అటెండెన్సు రిజిస్టరులో నేను సంతకం చేస్తుంటే వెనకే సుబ్బలక్ష్మి నిలబడింది. తనుకూడా సంతకం చెయ్యడం కోసం.

"అరె ...పెన్ తేవడం మర్చిపోయాను. మీ పెన్ ఇస్తారా సంతకం పెట్టి ఇస్తాను" అని నన్ను సుబ్బలక్ష్మి అడిగేసరికి "ఆహా.... ఎంత అందమైనదీ ప్రపంచము... ఈ సృష్టిలో ప్రతి యొక్కటియూ ఎంతో మధురమైనదిగదా?....భగవంతుని లీలలు ఎవ్వరికి అర్థమగును?"....అని ఆలోచిస్తూ తన్మయత్వంలో కళ్లు మూసుకున్నాను.

"మీకు పెన్ ఇవ్వడం ఇష్టం లేకపోతే పోనీలెండి...."

ఉలికిపడి కళ్లు తెరిచి చూశాను, సుబ్బలక్ష్మి నావంక అయోమయంగా చూస్తూ నిలబడి ఉంది.




నా తన్మయత్వం ఆమె తప్పుగా అర్థం చేసుకుందని గ్రహించాను.

"ఎంతమాట...మీకు పెన్ ఇవ్వడం నా అదృష్టం...." అన్నాను.

పెన్ క్యాప్ తీసి వెనకుకు తగిలించి ఆమె చేతికి ఇచ్చాను. మా అమ్మ తిట్టినట్టు నేను నష్ట జాతకుడినే. పెన్ను ఇచ్చేటప్పుడు కనీసం ఆమె చేతివేళ్లు కాదుకదా ఆ వేళ్ళ తాలూకు గోళ్లుకూడా తగల్లేదు.

"ఏమిటండీ మీ పెన్ వ్రాయడం లేదు,...." సుబ్బలక్ష్మి పెన్ పైకెత్తి పాళీ వైపు నిశితంగా పరిశీలిస్తూ చూసి అంది.

"ఏదీ ఇలా తెండి...."

ఆమె చేతిలోంచి పెన్ తీసుకున్నాను. మా అమ్మ తిట్టినట్టు ఈసారి కూడా నేను నష్టజాతకుడినే

ఆమెకంటే నిశితంగా పాళీని చూశాను. ఎడమ చేతిలోకి మార్చి మళ్ళీ చూశాను. పాళీ భూమికి లంబంగా ఉండేటట్టు పెన్నుని నిలువుగా పట్టుకుని చూశాను.

"పెన్ను బాగానే ఉందే!!.... ఇప్పుడే నేను సంతకం కూడా చేశాను. మీరు పట్టుకునే సరికి పిచ్చిముండ సిగ్గు పడిపోయి ఉంటుంది .. హి... హి . హి...."

ఆమె నవ్వలేదు.

నేను క్రిందికి వంగి ఓ చిత్తు కాగితం తీసి దాని మీద వ్రాసి చూశాను .... ఊహు ....లాభం లేదు. నేల మీదికి పెన్ను విదిలించాను. మళ్ళీ వ్రాశాను. కాగితం చిరిగింది. పెన్ను మళ్ళీ విదిలించాను. ఇంకు అయిపోయిందేమో, విదిలిస్తే ఇంకు రాలడం లేదు.

"పరవా లేదు లెండి ... ఈయన దగ్గర పెన్ను తీసుకుని సంతకం చేసేగాన ."

సుబ్బలక్ష్మి నాతో చెప్పి వాళ్ళ సెక్షను లోనే పని చేసే గణేశ్‌రావ్‌తో కలిసి వెళ్ళి పోయింది.

పెన్ను కనిపెట్టిన వెధవెవడో ఇంకు లేకపోయినా వ్రాసేటట్టు ఎందుకు కనిపెట్ట పోలేపోయాడు .... నా పెన్ను వ్రాయక వ్రాయాపోయే ఆ గణేశ్‌గాడి పెన్నెందుకు ?....థూ....

"ఫైళ్ళే అనుకున్నాను.... అటెండెన్స్ రిజిస్టర్ల మీదకూడా ఉమ్మేస్తున్నావా...." గుడ్లురుముతూ అన్నాడు మా సూపరింటెండెంట్.

నా వెనకే ఆయన నిలుచుని ఉండటం నేను చూడలేదు మరి.

ఈ మధ్య నాకేమిటో మహా చెడ్డ వికారంగా ఉంటోంది. ఒకరోజు డాక్టరు దగ్గరికి వెళ్ళాను.

"వికారంగా ఉంటుందండీ..." అన్నాను.

"మూడు పూట్లా ఎవోమిన్ మాత్రలు వాడు..." అని చెప్పాడాయన.

మాత్రలు వాడానుగానీ అవేమి పని చెయ్యలేదు మా అమ్మ నా కోసమని (నా వికారం కోసమని) ప్రత్యేకంగా నిమ్మకాయ పచ్చడి పెట్టింది పచ్చడి తింటున్నంత సేపూ బాగానే ఉంటుంది గానీ వికారం మాత్రం తగ్గలేదు.

నా వంద రూపాయల అప్పు తీర్చలేక పోయినా పాపారావ్ నాకు అంతరంగిక సలహాదారు అందుచేత నా వికారం సంగతి వాడికి చెప్పాను.

"కొద్ది రోజులుగా నిన్ను గమనిస్తున్నాను....నీ వికారం గురించి నాకు అర్థం అయిపోయింది. అది మందులకీ, పచ్చళ్ళకీ అల్లం రసాలకి తగ్గే వికారం కాదు."

"మరి?...." నేను బెంబేలెత్తి పోయాను.

"ఈ వికారం శారీరక రుగ్మతల వల్ల కలిగింది కాదు.... ఇది మానసికమైనది....దీనికి కారణం సుబ్బలక్ష్మి...."

"సుబ్బలక్ష్మి!!...."

"అవును...సుబ్బలక్ష్మిని నువ్వు ప్రేమిస్తున్నావు. వికారం ఈజీక్వల్టు ప్రేమ.... హ హ హ...."

వెంటనే చేతికి జేబురుమలు అందని కారణంగా చొక్కా పైకెత్తి నోటికి అడ్డు పెట్టుకుని నవ్వాడు పాపారావు. అతని చొక్కా క్రింది భాగం అంతా తడిసి పోయింది.

ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. పాపారావు మాటలే నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయ్.

"వికారం ఈజీక్వల్టు ప్రేమ...."

అవును సుబ్బలక్ష్మి నా డ్రీమ్‌గర్ల్... సుబ్బలక్ష్మిని నేను ప్రేమిస్తున్నాను. ఇన్నాళ్ళకి నేనుకూడా ప్రయోజకుడినయ్యాను.... సుబ్బలక్ష్మిని నా స్వంతం చేసుకుంటే గానీ నా వికారం తగ్గదు.

మర్నాడు....

"సుబ్బలక్ష్మిని నేను వికారిస్తున్నాను." అన్నాను పాపారావ్‌తో.

పాపారావు అర్థం కానట్టు చూశాడు నావైపు.


"అదే.... ప్రేమిస్తున్నాను.... వికారం ఈజీక్వల్టు ప్రేమ. నిన్న రాత్రంతా బాగా ఆలోచించాను.

"కానీ ఆలోచించకపోయినా నీ వికారం గురించి నాకు తెలుసు...."

"ఈ వ్యవహారంలో నీ సలహా కావాలి ఇప్పుడు నేనేం చెయ్యాలి?"

"ముందు ఆమె పనిచేసే సెక్షనుకి రోజూ ఏదో నెపం మీద వెళ్ళు.... ఆమె వైపు చూపులూ, చిరునవ్వులూ విసిరి ఆమె అంటే నీకు యిష్టం ఉందని ఆమెకి తెలిసేలా ప్రవర్తించు.... తరువాత నెమ్మది నెమ్మదిగా మాటలు కలుపు...."

"రోజూ పనిలేకుండా ఏ నెపం పెట్టుకుని ఆ సెక్షనుకి వెళ్ళాలి? తీరా వెళ్ళిన తరువాత అక్కడ ఓ మూల నిలబడి ఆమెవైపు చూస్తూ ఉంటే ఏం బావుంటుంది?...." అంటూ నా సందేహాన్ని వెలిబుచ్చాను.




పాపారావ్ విసుక్కున్నాడు.

"మరీ ఇంత అజ్ఞానం అయితే ఎలా? ... ఆ సెక్షనులోకి గణేశ్ రావ్‌తో స్నేహం కలుపుకో—అతనితో మాట్లాడడానికి వెళ్ళినట్టు వెళ్ళి ఆమె మీదకి లుక్స్ విసురు. అన్నట్టు గణేశ్ రావుది ఆ అమ్మాయి ప్రక్క సీటే, బాగా దగ్గర నుండే లుక్స్ విసరొచ్చు...."

పాపారావ్ సలహా నాకు బాగా నచ్చింది. అప్పటి కప్పుడే సుబ్బలక్ష్మి పనిచేసే సెక్షనుకి వెళ్ళాను. ఆ సమయంలో సుబ్బలక్ష్మి టైపు చేస్తోంది. గణేశ్ రావ్ ఫైల్లో ఏదో గెలుకుతున్నాడు పెన్నుతో.

కుర్చీ లాక్కుని గణేశ్ రావు ముందు కూర్చున్నాను. గణేశ్ రావ్ తలెత్తి నా వైపు చూశాడు.

"హలో గురూ బావున్నారా? ఏమిటో ఈ మధ్య మీరు మా సెక్షనుకు కూడా రావడం లేదు...." అన్నాను చాల కలుపు గోరు తనంగా.

గణేశ్ రావ్ తెల్లబోయి నా వంక చూశాడు. బహుశా హఠాత్తుగా నే చనువుగా పలకరించినందుకు కావోలు

"బాగానే ఉన్నాను...ఏం పని మీద వచ్చారు?..."

ఈ వెధవ హఠాత్తుగా ఇలా అడుగుతాడని అనుకోలేదు. వచ్చినవాడితో ఆ మాటా ఈ మాటా మాట్లాడితే వీడి సొమ్మేం పోయింది? ఏం పని మీద వచ్చారట! బోడి స్టైయిలూ వీడూను.

"ఏనేం లేదు...నా సీట్లో అంతగా పని లేదు. పోనీ గోళ్ళు గిల్లుకుందామనుకుంటే అవెప్పుడో కొరికేశాను....హి....హి....హి"

సుబ్బలక్ష్మి వంక ఓరగా చూశాను ఆమె నా జోక్‌కి నవ్వలేదు. అంత అందమైన అమ్మాయికి సెన్సాఫ్ హ్యూమర్ లేక పోవడమేమిటి? ఉహు.......ఉండే ఉంటుంది. నా జోక్ విని ఉండకపోయి ఉండొచ్చు... అంతే.

"మీకు పని లేకపోవచ్చుగాని నాకు చాల పని ఉంది........" అని తల ఫైల్లో దూర్చేశాడు గణేశ్ రావు.

నేను పాపారావ్ దగ్గరికి వెళ్ళి వాడిని చెడా మడా తిట్టేశాను...... నీ సలహా పడ్డినట్టే ఉందని.

"మరి ప్రేమంటే ఏమనుకున్నావ్?.... సహనం ఉండాలి. అవమానాలూ బాధలు భరించాలి ...సుబ్బలక్ష్మితో నీకు కాస్త పరిచయం అయ్యేవరకూ ఆ గణేశ్ రావ్ గాడిని బిడ్డులా పట్టుకో....ఆ తరువాత వాడిని నువ్వు కేర్ చెయ్యక్కర లేదు...." అన్నాడు మర్నాడు....పాపారావ్,

గణేశ్ రావ్ ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చున్నాను. "హలో బావున్నారా?" సుబ్బలక్ష్మి వైపు చూస్తూ గణేశ్ రావ్‌ని అడిగాను.

"బావున్నాను గానీ....చాల బిజీగా ఉన్నాను."

వెధవ ...నేను సుబ్బలక్ష్మి గురించి వస్తున్నట్లు పసిగట్టలేదు కదా?

"సర్లెండి .... పనెవరికి లేదు....ఇరవై నాలుగ్గంటలూ ఇలా ఫైళ్ళు ముందేసుకుని కూర్చుని ఇంత సీరియస్‌గా పని చేస్తే మెదడు మొద్దుబారిపోతుంది....మధ్యమధ్య నాలాంటి స్నేహితుల్తో కులాసాగా కబుర్లు చెప్తే అలసట అనేది ఉండదు ..."

"ఇంతకీ మీ పేరు?...." గణేశ్ రావ్ కుర్చీలో అలసటగా వెనక్కు వాలాడు.

"చూశారా...పని చేసి చేసి మీ మెదడు మొద్దుబారి పోయింది, నా పేరే మర్చి పోయారు. నా పేరు సీతారాం అండీ బాబూ...."

"ఏం పనిమీద వచ్చారు?"

"మళ్ళీ అదే కూశా?"

"అబ్బ........పనీ... పనీ ఏం సిన్సియర్ వర్కర్లండీ బాబూ" నవ్వుసటిస్తూ మస్కా కొడ్తున్న ధోరణిలో అన్నాను.

వెధవ కాస్త చిరునవ్వు నవ్వాడు. పడ్డాడు.... వల్లో పడ్డాడు.

"అద్సరేగానీ మీరు ఆవకాయ పెట్టుకున్నారా?...."

గణేశ్ రావ్ తెల్లబోయి చూశాడు.

సుబ్బలక్ష్మి కిసుక్కున నవ్వింది.

సుబ్బలక్ష్మికి సెన్సాఫ్ హ్యూమరుంది.

"ఏమిటి?...? గణేశ్ రావ్ అడిగాడు.

వీడికి బుర్ర లేదు. పదిసార్లు చెప్తేగానీ అర్థం కాదు.

"ఆవకాయ పెట్టుకున్నారా?...."

"అబ్బే ఇంకా లేదండీ...." ఇబ్బందిగా కదులుతూ సుబ్బలక్ష్మి వంక ఓ అరక్షణం చూసి అన్నాడు.

నాతో మాట్లాడుతూ అటు చూస్తాడేం వెధవ. కొంపతీసి సుబ్బలక్ష్మితో వెధవ్వేషాలు వెయ్యాలని అనుకోవడం లేదుకదా?

"ఇంకా ఆవకాయ పెట్టుకోలేదూ .... మాయింట్లో పోయిన నెల్లోనే పెట్టేశాం... మార్కెట్లోకి పళ్ళు వచ్చేస్తున్నాయ్. ఇం కొద్ది రోజులు పోతే మీకు మామిడికాయలు దొరకవు. త్వరగా ఆవకాయ పెట్టు కోండి...."

"అలాగే...."

"అన్నట్లు మీరు మామిడికాయ ముక్కల్ని ఉప్పులో ఊరేసి ఎండబెట్టి నిలవ ఉంచుకుంటారా?...."

"ఆ...." గణేశ్ రావు మళ్ళీ ఇటునుండి అటు కదిలాడు కుర్చీలో.

"మీకు మామిడి పళ్లలో ఏ పళ్లంటే యిష్టం?"


"ఏమీ యిష్టంలేదు...."

"నాకు చెరుకు రసాలంటే యిష్టం... కానీ ఇక్కడ మంచి రసాలు దొరకవు.... మా ఊళ్లో మంచి రకం రసాలు ఇంతంత పెద్దవి దొరుకుతాయి. ఏమిటి అలా కదులుతున్నారు?... కుర్చీలో గుండు సూదులేమైనా ఉన్నాయేమో చూసుకోండి...."

గణేశ్ రావ్ సీరియస్‌గా చూశాడు. నవ్వలేదు... వెధవకి సెన్సాఫ్ హ్యూమర్ లేదు. ఓరగా సుబ్బలక్ష్మి వంక చూశాను.

సుబ్బలక్ష్మి ముసిముసిగా నవ్వుతోంది. నాకు చచ్చేంత ఉత్సాహం వచ్చింది.

"ఇక్కడ పళ్ళు తూకం వేసి అమ్ముతారు గానీ మాఊళ్లో పాతికలు, పరకలు




లెక్కన అమ్ముతారు ...ఇంతకీ పరకంటే ఎంతో తెలుసా?...పదమూడండీ బాబూ.... ఇకపోతే అక్కడ పంచదార కలశాలు అనే మామిడిపళ్ళుకూడా దొరుకుతాయ్ అవి"

"నాకు అర్జంటుగా బయటికి వెళ్లే పనుంది....వస్తాను...."

గణేశ్ రావ్ కుర్చీలోంచి లేచి సర్రున బయటికి వెళ్లి పోయాడు. నేను కూడా లేవక తప్పలేదు.

మర్నాడు అదే సమయానికి గణేశ్ రావ్ సెక్షనులోకి అడుగు పెట్టాను. కుర్చీ లాక్కుని గణేశ్ రావ్ దగ్గర కూర్చుందా మని అనుకుంటూ ఉండగా "ఏమోయ్ సీతారాం....ఇలారా...." అంటూ వాళ్ళ సెక్షన్ సూపరింటెండెంటు లక్ష్మణ రావు పిలిచాడు.

రోజూ ఇలా వచ్చి మా క్లర్కుల్ని డిస్టర్బ్ చెయ్యకు అని తిట్టడానికి పిలిచా డేమో....నెమ్మదిగా అతని దగ్గరికి వెళ్లి నిలుచున్నా.

"కూర్చో...."

కూర్చున్నాను,

"నువ్వు శివానందం గారి అబ్బాయివేనా?"

"అవునండి!...."

"మరి చెప్పవేం?....నిన్న సాయంత్రం సుల్తాన్ బజార్లో మీ నాన్నగారు కలిశారు. మా వాడు కూడా మీ ఆఫీసులోనే పని చేస్తున్నాడు అని చెప్పారు. ఎలా ఉంటాడని అడిగాను. సన్నగా నల్లగా పొడుగ్గా అదో మాదిరిగా ఉంటాడని చెప్పారు.......అంతే చటుక్కున నువ్వే శివానందం గారి అబ్బాయివని పోల్చేశాను...."

లక్ష్మణరావు ఒక అరగంటపైగా నన్ను కూర్చోబెట్టి నానారకం చెత్త వాగుడు వాగి నన్ను పంపించేశాడు. సుబ్బలక్ష్మని చూడాలన్నా వీలు లేకుండా ఆమె సీటు వెనక్కు ఉంది. ఆయన మాట్లాడుతుంటే వెనక్కి తిరిగి చూస్తే ఏం బావుంటుంది?..

మళ్ళీ మర్నాడు గణేశ్ రావ్ సీటు దగ్గరికి బయలు దేరాను. సెతనులో అడుగు పెడుతూనే

"ఏం వోయ్....ఇలారా"

లక్ష్మణరావ్ పిలిచాడు....

అరగంట గడిచిపోయింది. నేను సెతనుకి వెళ్ళిపోయాను.

రోజూ ఇదే తంతు. గణేశ్ రావ్ దగ్గర కూర్చుని పది రోజులు అయిపోయింది.

నేను పాపారావ్‌కి నా ప్రాబ్లమ్ గురించి చెప్పాను. లక్షణరావు బారినుండి నేను బయటపడే ఉపాయమే లేదా? అని అడిగాను.

"నన్ను అడిగితే అది పెద్ద ప్రాబ్లమే కాదు....అసలైన ప్రాబ్లమ్ వేరే ఉంది."

నా గుండె దడ దడ లాడింది.

"ఏమిటి?...."

"నువ్వేమో ఆ లక్ష్మణరావుతో కాకా బానీ వేసుకుంటూ కూర్చున్నావ్...కానీ ఆ గణేశ్ రావ్ సుబ్బలక్ష్మిలో బాగా పరిచయం ఏర్పరుచుకుంటున్నాడు ... వాళ్ళ సెతనువాళ్ళు చెప్పారు. వాళ్ళిద్దరూ ఎప్పుడూ అదే పనిగా మాట్లాడుతూ ఉంటారట..."

నాకు ఒక్క క్షణం గుండె కడుపులోకి జారిపోయినట్టు అనిపించింది.

"ఓరి దౌర్భాగ్యుడా...అందుకనా ఈ మధ్య నేను పలకరించినా దులపరించుకుని వెళ్ళిపోతున్నావ్?....అమ్మో అమ్మో.... నా డ్రీమ్‌గర్ల్‌ని తన్నుకు పోవడానికి చూస్తున్నాడు."

"పాపారావ్.... సుబ్బలక్ష్మి నాకు దక్కేలా చూడు...."

"అయిదయి పోయింది.... మనం బయటకెళ్ళి ఎక్కడైనా కూర్చుని మాట్లాడితే బావుంటుంది."

ఎక్కడైనా కూర్చుని ముట్లాడితే బావుంటుందట. పబ్లిక్‌గార్డెన్‌లో కూర్చుని మాట్లాడదామంటే వస్తాడా వెధవ?

ఇద్దరం బార్‌కి వెళ్లాం.

సీసాలూ, గ్లాసులూ, జీడిపప్పులూ, కోడి కూర అన్నీ వచ్చేశాయ్.

పాపారావ్ వాటిమీద పడ్డాడు. కొద్దిసేపటికి పాపారావ్‌కి నిషా ఎక్కడం మొదలుబెట్టింది.

"నాయనా .... నువ్వు కాస్త సలహా పడేసి తరువాత తాగు .... నీ వాలకం చూస్తుంటే సలహా చెప్పకుండా ఔట్ అయ్యేలా ఉన్నావ్—...."

"ఓ తప్పకుండా ఇస్తాను. సలహాదేం ఉంది-అన్నట్టు నువ్వు నాకెప్పుడో వంద రూపాయలు అప్పు ఇచ్చినట్టున్నావ్ కదూ?"


"అర్థం అయ్యింది నాయనా .... ఆ వంద రూపాయలు కూడా నువ్వు ఇవ్వనక్కరలేదులే ...త్వరగా చెప్పు"

"సుబ్బలక్ష్మిని నువ్వు పొందాలంటే ముందు గనేశ్ రావు? సుబ్బలక్ష్మికి మధ్య మనస్పర్థలు కలగాలి...."

"ఎలా, ఎలా... ఎలా....ఎలా?...."

"అంత ఆతృతైతే ఎలా ? .... చెప్తాను విను. గణేశ్ రావ్‌కి ఏదైనా అవమానం జరిగిందనుకో...అప్పుడు అది చూసి సుబ్బలక్ష్మి నవ్విందనుకో... మయసభ సీనులో దుర్యోధనుడికి అభిమానం దెబ్బతిన్నట్టు గణేశ్ రావ్‌కి అభిమానం దెబ్బతింటుంది....అంతే వాడికథ ఫినిష్... నీ కథ స్టార్ట్...."

"కానీ సుబ్బలక్ష్మి నవ్వాలి కదా?"




"ఓరి అక్కుపక్షీ....సుబ్బలక్ష్మికి నవ్వొచ్చేలా గణేశ్ రావ్ అవమానించబడాలి..."

"ఎలా....ఎలా....ఎలా....ఎలా...?"

"అరటిపండు తొక్క!"

"అరటి పండు తొక్కా? .... ఏమిటది?...." నేను బుర్ర గోక్కున్నాను.

"మొన్నటినుండీ వాళ్ళు లంచ్ రూమ్‌కి వెళ్ళి లంచ్ తీసుకుంటున్నారు కదా?...."

"అవును"

"లంచ్‌టైం కాగానే ఇద్దరూ కలిసే వస్తున్నారు కదా?"

"అవును"

"ముందు గణేశ్ రావ్-వెనక సుబ్బలక్ష్మి ....మూడు రోజులనుండీ అలానే వస్తున్నారు. వాళ్ళు నీ టేబులు ముందునుండే వాళ్ళ సెక్షనుకు వెళ్ళాలి...."

"అయితే ఏమిటి?"

"రేపు నువ్వు లంచ్‌లో ఇడ్లీలు దోసెలు తినవు....ఇంచక్కా అరటి పళ్ళు తింటావ్"

"ఎందుకూ?!"

"ఎందుకేమిటి?....అరటిపండు తొక్కని జాగ్రత్తగా దాచుకుని అల్లంత దూరంలో గణేశ్ రావ్‌ని చూడగానే ఆ తొక్కని జాగ్రత్తగా అతను నడిచే దారిలో వెయ్యాలి.... గణేశ్ రావ్ దాని మీద కాలేసి జర్రున జారి పడ్తాడు....అప్పుడు వెనుకగా వస్తున్న సుబ్బలక్ష్మి ఫక్కున నవ్వుతుంది....క్లోజ్...."

నాకో సందేహం వచ్చింది....మళ్ళీ అడుగుతే తిడ్తాడేమోనని భయం వేసింది అయినా ధైర్యంచేసి అడిగేశాను.

"గణేశ్ రావ్ మరి ఆ తొక్కని తొక్కక పోతేనో?"

"ఎల్లుండి లంచ్‌లో మళ్ళీ అరటిపళ్ళే తింటావ్... ఎల్లుండికూడా తొక్కకపోతే ఆ మర్నాడు కూడా అరటిపళ్ళే తింటావ్ ఆ మర్నాడు కూడా తొక్కకపోతే..."

"ఇంక చాలు బాబూ....... అర్థం అయ్యింది.... యాహూ..." సంతోషం పట్టలేక గట్టిగా అరిచాను.

"నేను తాగితే నీకు నిషా ఎక్కిందేం?" పాపారావ్ ఆశ్చర్యంగా నా వంక చూశాడు.

ఆ రోజు రాత్రంతా నిద్రపట్టలేదు నాకు. రేపు గణేశ్‌గాడి చాప్టర్ క్లోజ్.... ఎల్లుండి నుండి సుబ్బలక్ష్మితో పరిచయం కోసం నేను వేసే కొత్త ప్లాన్స్....

మర్నాడు....

లంచ్ టైం....

అరటిపళ్ళు తినేశాను, నాకే కాదు.... పాపారావుకీ టెన్షన్‌గానే ఉంది.

లంచ్ టైం అయిపోయింది.

ఒకటి....రెండు....మూడు నిమిషాలు.

అదిగో గణేశ్‌రావ్....వాడికి వెనకాల పది గజాల దూరంలో సుబ్బలక్ష్మి.

నేను చేతిలోని అరటిపండు తొక్కని జాగ్రత్తగా ముందుకు విసిరాను.

"ఎందుకయినా మంచిది. ఇంకోటి రెండు గజాల అవతల విసురు...." పాపారావ్ గుసగుస లాడుతూ అన్నాడు.

నేను అలానే చేశాను.

గణేశ్‌రావ్ తొక్కని సమీపిస్తున్నాడు.

టక్ టక్ టక్ టక్....

అతని బూట్ల చప్పుడు.

లబ్ డబ్ లబ్ డబ్

నా గుండె చప్పుడు.

వచ్చేశాడు....వచ్చేశాడు.... అడుగు వే....హు.... దాటేశాడు.

టక్....టక్....టక్....టక్....

లబ్...డబ్...లబ్....డబ్....

రెండో తొక్క! .... వెయ్ .... అడుగు వెయ్ .... వేస్తున్నాడా? ప్చ్ .... దాన్నీ దాటేశాడు.

పాపారావు మాట ఇంకా పూర్తికానే లేదు ధ సేల్‌మని శబ్దం కెవ్వుమని—గూబ గళ్ళు పడిపోయేలా కేక వినిపించింది.

పాపారావు నేనూ ఉలిక్కి పడ్డాం.

మా కళ్ళముందు భయంకరమైన దృశ్యం.

సుబ్బలక్ష్మి నేలమీద వెల్లకితలా పడి ఉంది. ఆమె తల నేలని తాకి కొబ్బరి కాయ పగిలిన శబ్దం చేసింది.

ముక్కుతూ మూల్గుతూ లేచింది సుబ్బలక్ష్మి. ముందు వెళ్తున్న గణేశ్‌రావ్ పరుగెత్తి సుబ్బలక్ష్మి దగ్గరికి వచ్చాడు.

"దెబ్బ తగిలిందాండీ?" అని అడిగాడు.

"నిలువునా పడితే దెబ్బ తగలదూ?" సుబ్బలక్ష్మి విసుక్కుంది.

గణేశ్‌రావు చెయ్యి అందించి ఆమె లేచి నిలబడడానికి సాయపడ్డాడు.

నా నవనాడులు కృంగి పోయాయ్. గణేశ్‌రావ్, సుబ్బలక్ష్మి నాలుగడుగులు ముందుకు వేశారు.

మళ్ళీ కెవ్వున కేక .... దబ్బున శబ్దం.

రెండో అరటి పండు తొక్క కూడా సుబ్బలక్ష్మినే బలి తీసుకుంది.

సుబ్బలక్ష్మి వారం రోజులు శలవు పెట్టింది. ఆ రోజు లంచ్‌లో అరటిపళ్ళు తిన్నది నేనేనని ఆమెకి తెలిసి పోయింది.

".... నవ్వించే ప్రేమకథలుంటాయా అని ఒకసారి నన్ను అడిగావ్ గుర్తుందా?....నీదే ....హ.... హ.... హ ... " పాపారావ్ కర్చీఫ్ మూతికి అడ్డు పెట్టుకున్నాడు.

నాది పకపకా నవ్వు తెప్పించే ప్రేమ కథ ఎందుకౌతుంది? ✱